

- ఆసరా పింఛన్‌దారుల ఎదురుచూపులు
- దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా కలగని మోక్షం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు



చింతలమానేపల్లిలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు(ఫైల్)

పాతవి పెంచరు.. కొత్తవి ఇవ్వరు..

బెజ్జూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్తగా ఆసరా పింఛన్ మంజూరు చేస్తామని, ఉన్న పింఛన్లను మరో రెండు వేల రూపాయలు పెంచుతామని ఇచ్చిన హామీ ఏడాదిన్నర పూర్తి కావస్తున్నా నెరవేరకపోవడంతో లబ్ధిదారులు, అర్హులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన, గ్రామ వార్డుసభల్లోనూ వృద్ధాప్య, వితంతు, చేనేత, దివ్యాంగులు తదితర పింఛన్ల కోసం సుమారు ఐదువేలకుపైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇప్పటి వరకు కూడా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయలేదు. ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు 6,000, ఇతరులకు 4,000 పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పింఛన్ పెంచకపోవడం గమనార్హం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2016 పెన్షన్ ఇవ్వగా, తాము అధికారంలోకి వస్తే ఆసరా పెన్షన్లు రెండింతలు చేస్తామని, కుటుంబంలో ఇద్దరికి సమానంగా పెన్షన్లు ఇస్తామని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా హామీ అమలు కావడం లేదని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న పెన్షన్ తమ అవసరాలకు ఉపయోగపడుతున్నప్పటికీ ప్రస్తుతం నిత్యవసరాల ధరలు భారీగా పెరుగడం తో ప్రభుత్వం పెన్షన్ డబ్బులు ఏ మాత్రం సరిపోవటం లేదని లబ్ధిదారులు చెబుతు న్నారు.

● జిల్లా వ్యాప్తంగా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం పదిహేను మండలాల పరిధిలో 56,225 మంది ఆసరా పింఛన్‌దారులున్నారు. ఇందులో వృద్ధాప్య పెన్షన్‌దారు లు 24,235, దివ్యాంగులు 5,974, వితంతులు 22,095, చేనేత పెన్షన్లు 489, గీత కార్మికులు 139, బీడీ కార్మికులు 86, ఒంటరి మహిళల 2,605, ఫైలేరియా బాధితులు 567, డయాలసిస్ బాధితులు 35 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ. 13కోట్ల ఆసరా పెన్షన్ల ద్వారా అందజేస్తున్నారు. కొత్తగా భర్తలు కోల్పోయిన మహిళలు,దివ్యాంగులు సైతం ప్రభుత్వం నుంచి పింఛన్ అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి భర్తకు పింఛన్ ఉండి ఆయన మరణిస్తే ఆ వెంటనే ఆయన భార్యకు, భార్యకు పింఛన్ ఉండి ఆమె మరణిస్తే భర్తకు మంజూరు చేస్తున్నారు. కానీ కొత్తగా ఎవరు దరఖాస్తు చేసుకున్నా కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలు కుటుంబాలు పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఇలా జిల్లాలో వివిధ రకాల పింఛన్ల కోసం సుమారు ఐదువేల మందికిపైగా దరఖాస్తులు చేసుకున్నారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా చేయూత కింద ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను రెట్టింపు చేస్తామని, అర్హులైన వారికి కొత్తగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయకపోగా, ఉన్న వా టిని పెంచకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

● ఆరు గ్యారంటీల్లో భాగంగా..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలులో భాగంగా నిమగ్నమైన ప్రభుత్వం పెన్షన్ పెంపు విషయం మరిచి పోయిందని లబ్ధిదారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొలువు తీరిన ప్రభుత్వం తమ పెన్షన్ పెంచుతుందని ఎన్నో ఆశలు ప్రభుత్వంపై పెట్టుకున్నామని పెన్షన్‌దారులు పేర్కొంటున్నారు. వృద్ధులకిచ్చే పెన్షన్ రూ.2016 నుంచి రూ.4016కు, దివ్యాంగుల పెన్షన్ రూ.4016 నుంచి రూ.6016కు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ ప్రకారం ఆసరా పెన్షన్లను పెంచి ఆదుకోవాలని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. పలుమార్లు పింఛన్లను పెంచుతామని ప్రకటించినా ఇప్పటికి ఆచరణలో అమలు కాలేదు.దీంతో వారి ఆశలు నెరవేరడం లేదు. ఎవరూ లేని అనాథలకు పింఛన్లు ఆసరాగా ఉంటుందనుకున్న వారికి నిరాశే మిగిలింది. ప్రస్తుతం పాత పింఛన్లే కొనసాగుతున్నాయి.

ప్రభుత్వం హామీని అమలు చేయాలి..

- నికాడి రోశయ్య, ఎల్కపల్లి



ఆసరా పింఛన్‌దారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ని అమలు చేయాలి. గత ప్రభుత్వం దివ్యాంగులకు ఆసరా పెన్షన్ కింద రూ.4016 ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు ఇచ్చే పెన్షన్ రూ.2016 నుంచి రూ.4016, దివ్యాంగుల పెన్షన్ రూ.4016 నుం చి రూ6016 ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పెన్షన్లు పెంచి లబ్ధిదారులను ఆదుకోవాలి.

మహిళల గోరింటాకు సందడి



గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

బెజ్జూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న వాసవి మాత ఆలయంలో శనివారం ఆర్యవైశ్యం ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆషాడ మాసంలో మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకోవడం అనవాయితీగా చేపడుతారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తారని చెప్పారు. గోరింటాకు మహిళల చేతులు, కాళ్లకు కొత్త అందాన్నిస్తుందని, గోరింటాకు శుభానికి చిహ్నంగా భావిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా నాయకులు అంజమ్మ, జయ, మాయ, స్వప్న, సావని, మనీషా, పల్లవి, లావణ్య, లీన, శ్రీదేవి, విజయలక్ష్మి, సంధ్య, స్వాతి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న స్వాధ్యాయ పరివార బృందం

జైనూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని స్వాధ్యాయ పరివార బృందం అన్నారు. స్వాధ్యాయ పరివారం సభ్యులు శనివారం మండల కేంద్రం లోని సిర్పూర్(యు)కు రాక పోకలు నిర్వహించే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో స్వాధ్యాయ పరివారం సభ్యులు కోటగిరి శ్రీనివాస్, కోటల్‌వార్ దత్తు, శిందే రాజేందర్, జంగ్టే రాజు, ఆత్రం సుకలాల్, జ్ఞానేశ్వర్, పండిత్, రామారావ్, గుగ్గె ఉత్తం, రోహిదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కాగజ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను చైతన్య దివ్యాగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం, జనరల్ సెక్రటరి రమాకాంత్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జల్లంపల్లి శ్రీనివాస్, సప్తగిరి, గుల్జర్ బాయ్, ఎన్నం రవీందర్, నాజిరాబాను, తిరుతపమ్మ, సత్తయ్య, సతీష్, బాపు తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విశ్వసించొద్దు

తిర్యాణి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మూఢ నమ్మకాలను విశ్వసించొద్దని పలువురు నాయకుల అన్నారు. తిర్యాణి మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం టీపీజీఎస్, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. జీవో 49పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాలల్లో తెలుసుకున్న విషయాలను తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు జీవో 49 వల్ల జిల్లాలోని ఆదివాసీలకు కలిగే ఇబ్బందులపై వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాలాశ్రీ, శ్రీనివా స్, టికానంద్, కార్తీక్, రాజేందర్, డిప్యూటీ వార్డెన్ విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జికి స్వాగతం



అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

జైనూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు జైనూర్ మండల పార్టీ నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు. కుమరంభీం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి అనిల్‌కుమార్‌యాదవ్ జైనూరు మీదుగా వెళ్తున్న క్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, కాంగెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షులు పెందుర్ ప్రకాష్, సీనియర్ నాయకుడు మేస్రాం అంబాజీ, మాజీ సర్పంచులు కనక ప్రతిభ, రాథోడ్ సవిత రాందాస్, మండాడి లింగు, ఆత్రం దత్తు, తుమ్రం కోటేష్, ఆత్రం యాదవ్‌రావ్, ముకుంద్ పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో చోరీ

కెరమెరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలోని ముండేవార్ శ్రీకాంత్‌కు చెందిన బంగారం దుకాణంలో శనివారం వేకువ జామున 9 గ్రాముల బంగారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. దొంగలించబడిన బంగారం విలువ రూ.90 వేలు ఉంటుందని తెలిపారు. షాప్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దుకాణం పరిసరాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ సత్యనారాయణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో నెలవారి మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏఈ లక్ష్మీరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పట్టణంలోని బ్రాహ్మణ్‌వాడ, రావులవాడ, కంచుకోట, ఓల్డ్ పోస్టాఫీసుఏరియా, సందీప్‌నగర్, నూర్‌నగర్, జన్కాపూర్ అండ్ రామాలయం ఏరియా, కేబీ చౌక్, ఉస్మానియా మసీద్, దస్నాపూర్, హడ్కో కాలనీ, రహెమత్‌నగర్, జుబ్లీ మార్కెట్ మెయిన్ రోడ్డు, ఎన్జీవో కాలనీ, గొడవెల్లి, హీరాపూర్, ఎక్స్‌ప్రెస్ జిన్నింగ్ లైన్, ఎస్పీ పీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆసిఫాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ సమావేశంలో తీర్మాణించి ఆమోదం తెలపడంతో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయమని తెలిపారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, నాయకులు బాలేష్‌గౌడ్, అనీల్‌గౌడ్, సోమశేఖర్ , చరణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జీవో 49ని వెంటనే రద్దు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన్న రాజన్న డిమాండ్ చేశారు. మాలినిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమరం భీం జిల్లాను టైగర్ రిజర్వుగా ప్రకటిస్తూ జీవో 49 విడుదల చేయడంతో గిరిజనులకు నష్టం జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. వెంటనే జీవో 49ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముంజం ఆనంద్‌కుమార్, చాపిలే సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే

కాగజ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ వివేకానంద జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమం అలరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హనుక్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు క్రమశక్షణతో చదివి ఉత్తమ ఫలితారలు సాధిచానిఇ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బదిలీల షెడ్యూలు ప్రకటించాలి

కాగజ్‌నగర్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతల షెడ్యూ లు ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, 317 జీవో బాధితులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని చెప్పారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఐటీడీఏ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని కోరారు. పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ కార్మికుల వేతనాలు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు నెలనెలా చెల్లించాలని కోరారు. ప్రతీ కాంప్లెక్స్ కు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను జూనియర్ అసిస్టెంట్‌ను కేటాయించాలని గురుకుల పాఠశాలలకు టైం టేబుల్ సవరించాలని, జిల్లాకు రెగ్యులర్ విద్యాశాఖ అధికారి ఉండేల చర్యలు తీసుకోవాని చెప్పారు. ఎంఈవో పో స్టుల పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉప్పుల నరసింహచారి, జిల్లా ఇన్‌చార్జి విద్యా శాఖ అధికారి ఉదయబాబు, హనుమంతు, మోహన్ రావు, తంగడపల్లి రాకేష్, ప్రకాష్, రమేశ్, శ్రావణ్, వరలక్ష్మి, అనురాధబాయ్, సుజాత, ధనలక్ష్మి, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆసక్తి గల రైతుల నుంచి పండ్ల తోట పెంపకానికి ఈ నెల 15 లోగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలపారు. మండలానికి 50 ఎకరాల వరకు లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. మామిడి, జామ, నిమ్మ తోటలు పెంచడానికి ఆసక్తి ఉండాలని సూచించారు. ఐదు ఎకరాల లోపు సన్న చిన్న కారు ఎస్సీ ఎస్టీ, బీసీ రైతులు అర్హులని పేర్కొన్నారు. రైతులు ఉపాధి జాబ్ కార్డు, పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు, గ్రామ పంచాయతీ తీర్మానం అవసరమని తెలిపారు.. నీటి వసతి కలిగి ఉండాలని తెలిపారు.



మందులను అందజేస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. కోసిని గ్రామ పంచాయతీలో శనివారం స్పర్శఫౌండేషన్, ఎస్పీఎం సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీఎం యాజమాన్యం ఆధ్వర్యంలో స్పర్శఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిచారు. వైద్య శిబిరంలో డాక్టర్ శశిధర్‌రెడ్డి, స్పర్శ అసిస్టెంట్ మేనేజర్ సునీల్‌కుమార్, పీల్డు అధికారిణి సుశీల, నేరేళ్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర ఏర్పాట్ల పరిశీలన

కాగజ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్‌లోని మహంకాళి బోనాల జాతర ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లారీ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే ఈ జాతర పనులను ప్రారంభించారు. ఆలయప్రాంగణం సమీపంలో పారిశుధ్య పనులు చేయించారు. ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీసి సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతరకమిటీ అధ్యక్షుడు తుమ్మరమేష్, బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం

● రాకపోకలకు ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పెరిగిన పిచ్చి మొక్కలు

తిర్యాణి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగు పరుచాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్ర స్థాయిలో నెరవేరడం లేదు. మండలంలో పలు గ్రామాల రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణం నరకంగా మారింది. తారు రోడ్లు లేక పోవడంతో వర్షాలకు బురదమయంగా మారాయి. రోకపోకలకు వాహనాలు కదలలేని పరిస్థితి ఉండడంతో ఎడ్లబండ్లే దిక్కువుతున్న పరిస్థితి నెలకొంది. ఇక గర్భిణులు, రోగులను ఎడ్లబండ్లపై తరలించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ఎడ్లబండ్లు సైతం బురదలో దిగబడుతున్నాయి. మండలంలోని తాటిగూడ, ఎర్రబండ, గీసుగూడ, పునగూడ, కొత్తగూడ, కొటగాం గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ మారు మూల గ్రామాల్లో గోండు, కొలాం తెగలకు చెందిన గిరిజనులు నివసిస్తున్నారు.

చెత్తాచెదారం పెరిగిపోయి..

వర్షాలకు కాలిబాటల్లో చెత్తాచెదారం పెరిగిపోయింది. దీంతో పాటు వర్షాలకు రోడ్లన్నీ కాలు తీసి కాలు పెట్టలేనంత బురదగా మారుతున్నాయి. ఒక్కోసారి దారి ఆనవాళ్లు కూడా కనబడని దుస్థితి నెలకొంటుంది. ఏటా వర్షాకాలంలో ఈ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోతున్నాయి. సరైన రహదారి లేక పోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోతుంది. దీనికి తోడు గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉండడంతో రాక పోకలు పూర్తిగా నిలిచి పోతున్నాయి. ఈ సమస్యలను పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు అపరిష్కృతంగా మిగిలి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా నిత్యావసర సరుకుల కొనుగోలుకు, రేషన్ బియ్యం తీసుకోవడానికి, ఆసరా పెన్షన్, ఇతరాత్ర అవసరాలకు ఆరు కిలో మీటర్లు కాలినడకన దాంపూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలల్లో తిర్యాణి మండల కేంద్రానికి చేరుకుని అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు. అధికారులు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటేషన్‌పై ఆసిఫాబాద్‌కు కోటపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం

కోటపల్లి/మంచిర్యాల కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ. అశోక్ అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణల మేరకు ఆయనను డిప్యూటేషన్‌పై ఆసిఫాబాద్ బాలుర వసతి గృహానికి పంపించినట్టు కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిని పాఠశాల నుంచి తొలగించాలని పాఠశాల 9, 10వ తరగతుల విద్యార్థినీలు నిరసన తెలుపగా దర్యాప్తునకు కలెక్టర్ ఆదేశించారు. దర్యాప్తు అధికారులు పాఠశాలలోని ఉపాధ్యాయులు, వాచ్‌మెన్, విద్యార్థినిలతో విచారణ జరిపారు. బాలికల వివరణను పరిగణలోకి తీసుకుని సదరు ప్రధానోపాధ్యాయుడిని వెంటనే మంచిర్యాల జిల్లా నుంచి ఆసిఫాబాద్ జిల్లాలోని బాలుర వసతి గృహానికి డిప్యూటేషన్‌పై పంపించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని పూర్తి అదనపు ప్రధానోపాధ్యాయు డిగా నియమించారు. విద్యార్థినిల భద్రత కోసం ఉపాధ్యాయురాలిని సంక్షేమాధికారిగా నియమించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించడానికి ఒక మహిళ జిల్లా అధికారి, ఆసిఫాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విచారణ అధికారిగా నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. సదరు ప్రధానోపాధ్యాయుడు తన వివరణలో కొందరు నాయకులు తనను డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేశారని, ఇవ్వకపోవడంతోనే సస్పెన్షన్ చేయిస్తామని బెదిరించి ఆందోళనను ప్రేరేపించారని తెలిపినట్లు ప్రకటనలో వివరించారు.

నకిలీ విత్తనాలు సరఫరా చేసిన నిందితుడిపై పీడీ యాక్టు



నిందితుడికి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ

ఆసిఫాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా చేసిన గోరంట్ల సురేష్‌బాబుపై పీడీ యాక్టు అమలు చేసి నిందితుడిని కౌటాల సీఐ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం భీమవరంకు చెందిన గోరంట్ల సరేష్‌బాబు అనే వ్యక్తి నకిలీ విత్తనాలు సరఫరా పలు కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. పలు సందర్భాల్లో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి, బెజ్జూరు, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ మండలాల్లో 2018 నుంచి 2025 వరకు పలు కేసులు నమోదయ్యాయని అన్నారు. కేసులు నమోదైనా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ అమాయకపు ప్రజలను మోసాలు చేస్తూ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. ఇలాంటి అలవాటు పడిన నిందితుడి వల్ల ప్రజలకు ముప్పు కలుగుతుందనే ఉద్దేశ్యంతో సురేష్‌బాబు నేరాలకు శాశ్వతంగా చెక్ పెట్టడానికి గత ఏప్రిల్ 4న ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అన్నారు. ఈ మేరకు జూలై 3న నిందితుడిని రవీంద్రనగర్ గ్రామ శివారులో అరెస్టు చేసి పీడీ యాక్టు నమోదు చేసి నిందితుడిని కౌటాల ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రజలను మోసాలకు గురి చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్‌పై పాత కేసులలో ఉన్న నేరస్తులపై నిత్యం పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉండి తరుచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు.

డీజిల్‌లో నీరు.. వాహనదారుల ఆందోళన



డీజిల్‌లో వచ్చిన నీరు

కన్నెపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంక్‌లో డిజిల్‌లో నీరు రావడంతో వాహనదారులు ఆందోళన చేపట్టారు. శనివారం పెట్రోలు బంక్‌లో పలువురు ట్రాక్టర్లలో డీజిల్ పోయించుకున్నారు. కొంత సమయం తర్వాత ట్రాక్టర్లలోని సైలెన్సర్ల నుంచి పొగ అధికంగా వచ్చి ఆగిపోయాయి. దీంతో క్యాన్లలో తీసుకువెళ్లిన డీజిల్‌ను బంక్ వద్దకు తీసుకువచ్చి బంక్ యాజమాని ముందు పరిశీలించగా డీజిల్‌లో నీరు ఉన్నట్లు తేలింది. దీంతో వాహనదారులు బంక్ యాజ మానిని నిలదీశారు. వాహనాలకు మరమ్మతులు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన బంక్ యాజమాని మెకాని క్‌ల ను పిలిపించి ట్రాక్టర్లను రిపేర్ చేయిస్తానని, తానే ఖర్చులు భరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వరి నారుమడి యాజమాన్య పద్ధతులు

- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుడులు
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

కౌటాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతాంగం నారుమళ్లను సిద్ధం చేసి మొలక అలుకుతున్నారు. బోర్ల కింద సన్న రకాలైన ఎంటీయూ-1224, 1281, 1282, బీపీటీ, సాంబ మసూరిలతో పాటు పలు ప్రైవేట్ సీడ్స్‌కు సంబంధించి న స్వల్ప కాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రకాలైన వరి వంగడాలను వేసుకోవడానికి రైతాంగం సిద్ధమైంది. నాణ్యమైన వరి విత్తనాల ఎంపికతో పాటు నారు మడిలో మంచి యజమన్య పద్దతులు, సస్యరక్షణ చర్యలను చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వానాకాలం సాగుకు వరి నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వ్యవసాయాధికారులు రైతులకు తెలియజేస్తున్నారు.

ఏకరానికి 30 కిలోల విత్తనాలు..

ఎకరానికి 30 నుంచి 40 కిలోల వరి విత్తనాలు అవసరమవుతాయి. 20 సెంట్ల విస్తీర్ణంలో విత్తనాలు వేసుకోవాలి. 1.5 మీటర్ల వెడల్పుతో ప్లాట్స్ లాగా చేసుకని విత్తనాన్ని వేయాలి. విత్తనం వేసే ముందు కిలో విత్తనానికి 3-4 గ్రాములు కాప్టన్ లేదా థైరంతో విత్తన శుద్ధి చేసుకోవాలి. దుక్కిలోనే హెక్టర్‌కు 1 టన్ను పశు వుల ఎరువు లేదా సేంద్రియ ఎరువు వేసుకోవాలి. మూడు కిలోలల భాస్వరం ఇచ్చే ఎరువు, రెండు కిలోలల పోటాస్‌లను వేయాలి. ఈ పద్ధతిలో ముఖ్యంగా ఐరన్, పోటాషియం లోపం కనిపిస్తుంది. దీనిని నివారించుకోవడానికి సూక్ష్మపోషకాలను పిచికారి చేసుకోవాలి.

నారుమడి తయారీ..

నారు పోయాల్సిన మడిని 10 నుంచి 12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టేందుకు ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. వడ్లను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి తీసిన అనంతరం మరో 24 గంటల పాటు మండె కట్టి తరువాత చిన్నగా మొలకత్తిన వడ్ల గింజలను (స్ప్రౌడ్స్) దమ్ము చేసిన మడిలో వెద జల్లుతారు. బోరు బావుల కింద, నీటి వసతి గల భూముల్లో ఈ పద్ధతిని సాగు చేయాలి. కాగా ప్యాడీ ట్రాన్స్‌ప్లాంటర్ (వరి నారు యంత్రం)తో నాట్లు వేయడం కోసం నారు మడిని మ్యాట్లపై వేస్తారు. యంత్రంలో బిగించడానికి అనుగుణంగా పొలంలో సన్న పాటి మందం గల మ్యాట్లను పరిచి వాటిపై ఎరువులతో కూడిన మట్టిని వేసి నారును పెంచుతారు. నారు పెరిగిన తరువాత మ్యాట్లను చుట్టి యంత్రాల్లో పెట్టి నాట్లు వేస్తారు. దీని కోసం రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సాధారణంగా మూడురకాలు..

వరి నారుమడులు సాధారణంగా మూడురకాలుగా ఉంటాయి. పొడినారుమడి, బురద నారుమడి, మ్యాట్‌పై నారుమడిగా చెబుతారు. మండలంలో ముఖ్యంగా పొడి నారుమడి బురద నారుమళ్లనే ఎక్కువగా ఉపయోగిస్తారు. పొడి నారుమడి అనగా పొడి దుక్కిలోనే పొడివడ్ల గింజలను వెదజల్లి మట్టిని కప్పుతారు. వర్షపు నీటి ఆధారంతో, బోరుబావుల ద్వారా నీటిని అందించడంతో నారు మొలుస్తుంది. ఈ పద్ధతిని ముఖ్యంగా చెరువులు, కుంటలు, కాలువల కింద మొదట నీటి వసతి లేకుండా వర్షపు నీటిపైనే ఆధారపడే ప్రదేశాల్లో ఉపయోగిస్తారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి..

ప్రేమలత, వ్యవసాయాధికారి, కౌటాల

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని నారు పోసుకుని సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వడ్లను ముందే విత్తన శుద్ధి చేసుకుంటే తెగుళ్లను నివారించుకోవచ్చు. నారు మళ్లలో సరైన విధానంగా ప్లాట్స్‌ను తయారు చేసుకుని విత్తనాలు చల్లుకోవాలి.



గుడుంబా పట్టివేత

వేమనపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నెన్నెల మండలం లంబాడితండా గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి శనివారం వేమనపల్లికి గుడుంబా తీసుకు వస్తుండగా మాటు వేసి పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడుంబా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ద్విచక్ర వాహనంపై వస్తున్న రవిని పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న సంచుల్లో గుడుంబా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. వంద లీటర్లు గుడుంబా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

భీమారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన భూపల్లి లక్ష్మయ్య అనే వ్యక్తి మద్యం సేవించి పోలీసులతో దురుసుగా ప్రవర్తించినందుకు అతన్ని అరెస్టు చేసి చెన్నూరు కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు భీమారం ఎస్ఐ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. భీమారం గ్రామంలోని మన్నెపువార్డుకు చెందిన లక్ష్మయ్య శుక్రవారం మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో దురుసుగా మాట్లాడుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో కేసు నమోదు చేసి చెన్నూరు కోర్టులో హాజరు పర్చగా లక్ష్మయ్యను లక్షెట్టిపేట జైలుకు రిమాండ్ తరలించాలని జడ్జి ఆదేశించారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించడం, విధులకు ఆటంకం కలిగించడం చట్ట విరుద్ధమని ఎస్ఐ తెలిపారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

దహెగాం, జూలై 12(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల నియంత్రణకు తమ వంతు కృషి చేయాలని డీఎస్పీ రామానుజం అన్నారు. కొంచవెల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో శనివారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా, మానసికంగా అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి, ఏకత్వం, క్రమ శిక్షణ పెంపొందుతాయని అన్నారు. యువత తప్పుదారి పడకుండా మంచి దారిలో ఉండేందుకు ఇటువంటి క్రీడలు దోహదపడుతాయని తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వాడినా, సరఫరా చేసినా సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



ఫోన్‌ను అందజేస్తున్న సీఐ, ఆటో డ్రైవర్

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తన ఆటోలో ఫోన్ మర్చిపోయిన మహిళకు ఫోన్ అందజేసి ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. సీఐ దేవేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌కు చెందిన స్వప్న చెన్నూరులోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తన కొడుకును చూడడానికి శనివారం వచ్చింది. తిరిగి ఆటోలో వెళ్తున్న క్రమంలో తన మొబైల్ ఫోన్‌ను ఆటోలో మర్చిపోయింది. దీంతో గమనించిన ఆటోడ్రైవర్ ఫోన్‌ను చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వగా వారు స్వప్నకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో స్వప్నకు ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఆటోడ్రైవర్‌ను అభినందించారు.

పార్టీ జెండా మోసిన వారికే పదవులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికే పదవులు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండా మోసిన ప్రతి ఒక్కరికీ జిల్లా కమిటీలో అవకాశం వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. ఈ రిజర్వేషన్లను బీసీ నాయకులు వినియోగించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో డి లిమిటేషన్ ప్రక్రియ ద్వారా నియోజక వర్గాల సంఖ్య కూడా రాష్ట్రంలో 151కి పెరుగుతుందన్నారు. దీనిలో బీసీలతో పాటు మహిళలకు కూడా పెద్ద ఎత్తున అవకాశాలు వస్తాయన్నారు. గతంలో అధికారులంలో లేనప్పుడు నాయకుల, కార్యకర్తల పరిస్థితి ఎలా ఉండే అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలోకి నాయకులు రావడం సహజమని గుర్తు చేశారు. పార్టీ బాగుంటేనే నాయకులు బాగుంటా రని ఆ దిశగా పని చేయాలన్నారు. అధికారంలో లేనప్పుడు సమస్యలపై పోరాటం చేశామని, వాటిని పరిష్కరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలువాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఎవరిని సంప్రదించాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతకు ముందు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రమేశ్‌బాబు మాట్లాడుతూ అన్ని మతాలు, కులాలు వర్గాలకు సమన్యాయం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ జిల్లాకు ప్రనాధారమైన ప్రాణహిత నదిపై కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అడుగులు పడుతున్నట్లు తెలిపారు. . మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ 75 సంవత్సరాలు బీసీ రిజర్వేషన్ కల నెరవేర్చిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని కితాబిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ మాట్లాడుతూ కొంత మంది కుట్రలు చేసి తన ఓటమికి కారణమయ్యారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తన వర్గీయులకు టికెట్లు కేటాయించాలని వారిని గెలపించుకుంటానని తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ తిరుపతి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నాయకులు రమేశ్, నరేష్‌జాదవ్, గణపతి, విశ్వనాథ్, సదయ్య, శ్యాం, సుగుణక్క, బాలేష్‌గౌడ్, అనీల్‌గౌడ్, మల్లన్న, మునీర్, రామయ్య, వసంతరావు, చరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఫొటో లేక పోవడంతో ఆయన వర్గానికి చెందిన నాయకులు మండిపడ్డారు. జిల్లా ఇన్‌చార్జి రమేశ్‌బాబు ఎదుట నిరసన వ్యక్తం చేయడానికి సిద్ధ పడగా ఆయన వారిని వారించే ప్రయ త్నం చేశారు. పెద్ద కార్యక్రమాలు చేసే సందర్భంలో చిన్న చిన్న పొరపాట్లు జరగడం సర్వసాధారమని భవిష్యత్‌లో ఇలా జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఫ్లెక్సీలో ఫొటో పెట్టక పోవడం తమను అవమానించడమేనని నినాదాలు చేయడంతో వారిని ఉద్దేశించి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మాట్లాడే సమయంలో సమాధానం చెబుతానని చెప్పడంతో కార్యకర్తలు శాంతించారు.

పూర్తయిన బస్సు షెల్టర్ పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్సు షెల్టర్

జైనూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం ఎట్టకేలకు బస్సు షెల్టర్ నిర్మాణం పూర్తయింది. మరి కొద్ది రోజుల్లో బస్సు షెల్టర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మండల కేంద్రంలో బస్సు షెల్టర్, మూత్ర శాలలు లేనందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూత విసర్జన, బహిర్భూమికి వెళ్లేందుకు తగిన సదుపాయం లేదనందు మహిళ ప్రయాణికులు ఎదుర్కోంటున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈజీఎస్ పథకంలో భాగంగా మూత్ర శాలతో పాటు బస్సు షెల్టర్‌ను నిర్మించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని తెలి పారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు, వివరాలకు 8712658596 లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు డబ్బాతో వ్యక్తి హల్‌చల్

జన్నారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చనిపోతానని బెదిరిస్తూ తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. రేటిగూడ గ్రామానికి చెందిన కయ్యం మల్లయ్య తన కోడలు పేరు మీద పట్టా చేయడానికి తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా మల్లయ్య చిన్న కుమారుడు కయ్యం రామన్న తహసీల్దార్ కార్యాలయానికి శనివారం వచ్చి పట్టా ఎలా మార్పిడి చేస్తావంటూ, విధులకు ఆటంకం ఎరిచి క్రిమిసంహారక మందుతాగి చనిపోతానని బెదిరించాడు. జన్నారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు రామన్నపై కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ఐ అనూష తెలిపారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కార్యాచరణ



జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని యూనియన్ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ బి జనక్ ప్రసాద్ అన్నారు. మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో శనివారం బెల్లంపల్లి రీజియన్ కోర్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజియన్ పరిధిలో నూతన కమిటీలు, సబ్ కమిటీలు ఏర్పాటు చేయా లన్నారు. యువ కార్మికులకు సభ్యత్వాలు ఇవ్వాలని, గోదావరిఖనిలో ఆదివారం నిర్వహించనున్న శంఖారావు-బహిరంగసభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం గురుపౌర్ణమిని పురస్కరించుకొని జనక్‌ప్రసాద్ పేరిట సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, జనక్ ప్రసాద్ గత 13 ఏళ్లుగా కనీస వేతనాల కోసం పోరాడుతున్నారని చెప్పారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఐదు వేల రూపాయల లాభాల బోనస్ ఇప్పించారని, తెలంగాణలోని 1.3 కోట్ల మంది అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణకు పాటుపడు తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, రాంశెట్టి నరేందర్, దేవి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న మేనేజర్ శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్ కోరారు. ఈ మేరకు ఆయన ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఓసీపీలో అత్యధికంగా 42 మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి సరైన సౌకర్యాలు లేవన్నారు. వాష్‌రూంలు పెంచాలని, సీహెచ్‌పీలో నూతన వాష్‌రూంలు ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా ఉద్యోగులు, జనరల్ అసిస్టెంట్ ఉద్యోగులకు రెస్ట్ హాల్ విస్తీర్ణం పెంచి లాకర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు ఎక్కువగా ఉన్నందున అదనంగా మరో షెడ్డు నిర్మించాలని, క్యాంటీన్ విస్తీర్ణం పెంచి సరిపడా ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు భాస్కర్‌రావు, నిఖిల్, సహాయ పిట్ కార్యదర్శి జంగా రమేశ్, షిఫ్ట్ ఇన్‌చార్జిలు సారయ్య, బుర్ర శ్రీనివాస్, రాజ్‌కుమార్, క్రాంతి, అనిరుధ్ పాల్గొన్నారు.



ఓసీపీలో క్యాంటీన్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓసీపీలో క్యాంటీన్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఉద్యోగులు భోజనం చేసేందుకు వసతులు కల్పించాలని కోరారు. . కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య, టేడ్స్‌మెన్ కమిటీ సభ్యుడు నాగభూషణం పాల్గొన్నారు.

పిట్ కార్యదర్శుల నియామకం

శ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీలో పిట్ కార్యదర్శులను శనివారం నియమించారు. ఎస్‌ఆర్‌పీ 1 పిట్ కార్యదర్శిగా పారుపల్లి శ్రీధర్, ఆర్‌కే 7 పిట్ కార్యదర్శిగా రౌతు సత్యనారాయణను నియమించారు. ఎనిమిదేళ్లుగా పిట్ కార్యదర్శులుగా సేవలందిస్తున్న వెంకటేష్, శ్రీకాంత్‌ను ఏరియా కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ నియామకపత్రాలను ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అందించారు.

ఓరియంట్ ఎన్నికల్లో గుర్తుల కేటాయింపు

కాసిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్(అదాని) కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అందులో బాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి డీసీఎల్ రాజేశ్వరమ్మ గుర్తులను కేటాయించారు. అలాగే ఈ నెల 18న గుర్తింపు సంఘం ఎన్నికలపై ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఓరియంట్‌లో 266 మంది ఓటర్లు ఉండగా ఐదు కార్మిక సంఘాలు పోటీ చేసేందుకు అర్హత సాధించాయి. స్థానిక కార్మిక సంఘం నాయకులు ఏనుగు తిరుపతిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ద ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘానికి విమానం గుర్తు కేటాయించారు. రాములు నాయక్ ప్రాతినిధ్య వహిస్తున్న ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్‌కు చక్రం గుర్తు కేటాయించారు. కొక్కిరాల సత్యపాల్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌కు తరాజు గుర్తు కేటాయించారు. స్థానిక కార్మిక సంఘం నాయకులు సతీష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్‌కు త్రిశూలం గుర్తు కేటాయించారు. పుస్కూరి విక్రమ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్‌కు పులిగుర్తును కేటాయించారు. ఎన్నికల గుర్తులు కేటాయించడంతో దేవాపూర్ ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ నెలాకరులోగా ఓరియంట్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే విధంగా ఓరియంట్ కంపెనీ అధికారులు లేబర్ కమిషన్ ఆఫీసర్లు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

చెన్నూరు లో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి


సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఓనర్ల, డ్రైవర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చెన్నూరు గోదావరి వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ డాక్టర్ రాజారమేష్ డిమాండ్ చేశారు. చెన్నూరులో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు రోజులుగా ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని నిరసనలు చేస్తున్న ట్రాక్టర్ ఓనర్లను, డ్రైవర్లను ప్రభుత్వం కానీ, అధికారులు కానీ,స్థానిక ఎమ్మెల్యే కానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రతి రోజు చెన్నూరు గోదావరి నుంచి వందల లారీల ఇసుక తరలిపోతుంటే స్థానికంగా ఉన్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్‌వెంకటస్వామి ప్రస్తుతం మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్నారని అయినా ఇక్కడ ఇసుక రీచ్ ఏర్పాటు చేయకపోవడం ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. వెంటనే మంత్రి స్పందించి ఎలాంటి షరతులు లేకుండా ట్రాక్టర్‌లకు ఇసుక ఇవ్వాలని , ఓనర్ల, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కస్తూర్బాలో గోరింటాకు సంబురాలు


కేజీబీవీలో గోరింటాకు సంబరాల్లో ఉపాధ్యాయులు

దండేపల్లి జూలై, 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఆషాఢమాసం సంబురాలను ఘనంగా నిర్వహిచారు. విద్యాలయ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు మైదాకులను రుబ్బారు. ఒకరికొకరు గోరింటాకు రాసుకుని సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జన్నారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్ ఇంధన్‌పల్లి రేంజ్‌లో శనివారం ఎఫ్‌డీవో రామ్మోహన్ సందర్శించారు. జరిగిన అభివృద్ధి పనులతో పాటు వర్షాకాలంలో మొక్కలు సంరక్షించడంపై సూచనలు చేశారు. గతంలో చేసిన పనులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటడంపై వివరించారు. ఈ సందర్భంగా ఇంధన్‌పల్లి చెక్‌పోస్టును సందర్శించారు. ఆయన వెంట ఇంధన్‌పల్లి ఎఫ్‌ఆర్‌వో శ్రీధరాచారి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, ఇంధన్‌పల్లి ఎఫ్ఎస్‌వో రవి, బీట్ అధికారి రాజేశ్వర్ ఉన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మందులతో వ్యాధి నివారణ సాధ్యమని ప్రభుత్వ వైద్యుడు రాపాక రమేష్ తెలిపారు. శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విష్ణుతేజ, ప్రీతి, స్వర్ణలత, మధుబాబు, శ్రీలత, వెంకటేశ్వర్లు, కళావతి, టీబీ సూపర్ వైజర్ కుమార్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట ప్రభుత్వ కళాశాలకు పూర్వ వైభవం

- రెట్టింపైన అడ్మిషన్లు
- కార్పొరేటుకు దీటుగా సకల సౌకర్యాలు


లక్షెట్టిపేట ప్రభుత్వ కళాశాల నూతన భవనం

లక్షెట్టిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ వైభవం వచ్చేసింది. ఒకప్పుడు లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీటు దొరకాలంటే కష్టంగా ఉండేది. ఈ కళాశాలలో గతంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అలాంటి కళాశాలను 20 ఏళ్లకు పైగా పట్టించుకునే నాయకులు, అధికారులు కరువు కావడంతో అడ్మిషన్లు తగ్గిపోయి కళాశాల బోసిపోయింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కళాశాలకు మళ్లీ ఈఏడాది పూర్వ వైభవం వచ్చి అడ్మిషన్లు ఒక్కసారిగా రెట్టింపు స్థాయికి చేరుకున్నాయి.

కార్పొరేటు స్థాయిలో వసతులు..

లక్షెట్టిపేటలో 2023 డిసెంబర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి పాత కళాశాలతో పాటు అందులోనే ఉండే ప్రభుత్వ పాఠశాల భవనం కాలిపోయింది. విషయం తెలుసుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ప్రమాదంలో దెబ్బతిన్న భవనాన్ని పరిశీలించారు. ఒకప్పుడు తాను చదువుకున్న కళాశాల పరిస్థితి చూసి చలించారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అధ్యాప కులతో మాట్లాడారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య తెలుసుకున్నారు. వెంటనే సకల సౌకర్యాలతో భవనం ఏర్పాటుకు అనుమతులు తీసుకువచ్చారు. కార్పొరేటుకు దీటుగా భవనం ఉండాలని తాను చదువుకున్న కళాశాల రూపు రేఖలు మార్చా లని కంకణం కట్టుకున్న ఆయన ఏడాది లోపే భవ నం పూర్తి చేసే దిశగా ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ భవనం నిర్మించి అందులో సకల సౌకర్యాలు ఫర్నిచర్ నుంచి ల్యాబ్ పరికరాల వరకు అన్ని సమకూర్చారు.

ఈఏడాది 370 కొత్త అడ్మిషన్లు...

కళాశాలలో గత ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం గాను 169మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఈఏడాది మొదటి సంవత్సరంలోనే 370కి చేరింది. జూలై, ఆగస్టులో కూడా అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు.

హాస్టల్ విద్యార్థులకు అడ్మిషన్ లభించక ఇబ్బంది..

ఇక్కడి కళాశాలలో అడ్మిషన్ పొందిన దూర ప్రాంత విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలు కూడా ఉన్నాయి. అప్పట్లో అడ్మిషన్లు తక్కువగా ఉండటంతో ఇక్కడ ఉన్న వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య కేవలం వంద మంది వరకు మాత్రమే అనుమతి ఉండటంతో ఇబ్బంది తలెత్తుతోంది. వసతిగృహాల్లో కూడా బాల బాలికలకు పూర్తి స్థాయిలో కళాశాల అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అనుగుణంగా సీటు దొరికితే ఎక్కువ అడ్మిషన్లు పెరుగే అవకాశం ఉంది.



కళాశాల చాలా బాగుంది..

శిఫా, ఇంటర్ ఫస్టియర్, తాళ్లపేట



నేను మొదట్లో ప్రైవేట్ కళాశాలకు వెళ్దామని అనుకున్నాను. కానీ మాగ్రామంలో కొంతమంది లక్షెట్టిపేటలో ప్రభుత్వ కళాశాల నూతనంగా ఏర్పాటు చేశారు చాలా బాగుంది అని చెప్పడంతో ఒక సారి వచ్చి చూసా. చూడగానే బాగనిపించడంతో ఇందులో చేరాను. కళాశాలలో తరగతి గదులతో పాటు ల్యాబ్, గార్డెన్ ఇతర వసతులు కూడా చాలా బాగున్నాయి.

వచ్చే ఏడాది ఫేజ్‌ల ద్వారా అడ్మిషన్లు..

కల్వల లక్ష్మణ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్, లక్షెట్టిపేట.



ఈఏడాది అడ్మిషన్ల స్థాయి రెట్టింపు దాటింది. వచ్చే ఏడాది ఇంకా చాలా వరకు పెరుగుతాయి. అందుకోసం వచ్చే ఏడాది నుంచి గతంలో తీసుకున్నట్లు ఫేజ్‌ల ద్వా రా విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తాం. రానున్న 50 ఏళ్ల వరకు విద్యార్థులకు అనుగుణంగా ఉండేలా ఈకళాశాల భవనం ఏర్పాటు చేసి అందులో వసతులు కల్పించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించడంలో తోడ్పాటు అందించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు విద్యార్థులు రుణపడి ఉంటారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం..

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



రానున్న మూడేళ్లలో లక్షెట్టిపేట పరిసరాల్లో ప్రైవేట్ కళాశాల, ఆసుపత్రులు ఉండవు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేటుకు దీటుగా ఉచిత విద్య, వైద్యం అందించాలన్నదే నాలక్ష్యం. అన్న మాట ప్రకారం కళాశాల ఏర్పాటు చేసాను. విద్యార్థుల సంఖ్య కూడా ఇప్పటికే పెరిగింది. మున్ముందు మరింత పెరుగుతుంది.

బీసీలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మందమర్రిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ప్రజాప్రభుత్వానికి బీసీలందరు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మందమర్రి బీసీ సంఘం అధ్యక్షుడు సకినాల శంకర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థల్లో కల్పించడాన్ని హర్షిస్తూ పట్టణంలో శనివారం సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సతీష్, గుడ్ల శ్రీనివాస్, వేణుగోపాల్‌రావు, రాజు, శేఖర్, ప్రభాకర్, నర్సోజీ, సంపత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి జూలై 12 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మి అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారిది పేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఐదు వేల రూపాయల నగదును అందజేశారు. వీటిని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతురాలు కుటుంబానికి నగదుతో పాటు 25 కేజీ బియ్యం బస్తాను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇప్ప సురేందర్, నాయకులు సిద్ది ప్రతాప్, చెరుకు శ్రీనివాస్, జోగినిపల్లి అశోక్ పాల్గొన్నారు. రాయల్ వినాయక గ్రూప్ యూత్ ఆధ్వర్యంలో 10,516 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు ప్రవీణ్, శంకర్, విజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

జన్నారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులకు శనివారం స్థానిక రైతు వేదికలో బూత్ లెవల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

భీమారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యాపలబొగుడ సమీపంలో గల బోయవాడలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు విగ్రహాన్ని ఆలాయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేరెంట్ కమిటీ నియామకం

లక్షెట్టిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం పేరెంట్ కమిటీని శనివారం పాఠశాల ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా ఎల్ తిరుపతి, ఉపాధ్యక్షురాలిగా సరిత, అసోసియేట్ సెక్రెటరీగా మురళి, జాయింట్ సెక్రెటరీగా సత్యం, కోశాధికారిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. సలహాదారులుగా లింగయ్య, తిరుపతి, పోచమల్లు, చంద్రయ్య, గీతా, జ్ఞానేశ్వరి, అఖిల, రాజమణి, కళ్యాణి, నరేష్‌ను నియమించారు. కార్యవర్గ సభ్యులు ప్రిన్సిపాల్ రెమాకళ్యాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎస్‌పీపి గీతాంజలి, జేపీపి శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు

హాజీపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకులంలో శనివారం స్కూల్ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఎన్నికల ద్వారా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్కూల్ పీపుల్ లీడర్, డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్, స్పోర్ట్స్ లీడర్లను ఎన్నుకున్నారు. ఎన్నికలను ప్రిన్సిపాల్, ఉమ్మడి జిల్లా ఎంజేపీ గురుకులాల ఆర్‌సీవో సేరు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇందారం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వారి వివరాలను పోలీసులకు అందించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ధరించి వాహనం నడపాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే డయల్ 100కు కానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. భద్రతపరమైన విషయాలు, పోలీసుల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి ప్రస్తుత పరిస్థితి, జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల జీవనానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై నిఘా నియంత్రణలో భాగంగా అనుమానస్పద ప్రాంతాలను, ఇళ్లను నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 70 ద్విచక్రవాహనాలను, ఐదు ఆటోలకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రధాన ఎజెండా

- నేడు జిల్లాలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రుల పర్యటన

(5వ పేజీ తరువాయి)


చేయనుండగా ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయి.

డిప్యూటీ సీఎం టూర్ షెడ్యూల్ ఇలా...

మంచిర్యాల నియోజకవర్గంలో ఆదివారం పర్యటించబోయే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క టూర్ షెడ్యూల్ ఇలా ఉంది. ఉదయం 8.30గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి బయలు దేరుతారు. మధ్యాహ్నం 12గంటలకు లక్షెట్టిపేట చేరుకొని అక్కడ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హైస్కూల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులతో మమేకం కావడంతో పాటు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు దండేపల్లి మండలం చేరుకొని రెండు గంటలకు ఇందిరా మహిళా శక్తి సోలార్ పైలెట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన, మూడు గంటలకు బహిరంగ సభలో మాట్లాడుతారు. నాలుగు గంటలకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తారు. రాత్రి ఎనిమిదిగంటలకు ప్రజాభవన్‌కు చేరుకుంటారు.

పర్యటనను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లాలో ఆదివారం జరగనున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రుల పర్యటనను పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ భాస్కర్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు శాఖ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, సురేఖ

లక్షెట్టిపేట: ప్రభుత్వ ఆసుపత్రి భవన ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రుల పర్యటను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగ ర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం నూతన ఆసుపత్రి భవనం వద్ద రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రి భవనం ప్రారంభంతోపాటు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా మంచిర్యాల నియోజకర్గం నిలుస్తుందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సంబంధిత అధికారులతో పరిశీలించారు.

సభాస్థలి పరిశీలన


దండేపల్లి: జిల్లాలో ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పర్యటనకు అధికారులు అన్నిఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో నిర్వహించనున్న కార్యక్రమాలపై మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీపీ భాస్కర్, జిల్లా ఉన్నత అధికారులతో కలిసి బహిరంగ సభస్థలిని శనివారం వారు పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటి ఛైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

బెల్లంపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీపీసీసీ ఇన్‌చార్జి రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులందరూ కలిసి కట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని ఎవరు కూడా నిరుత్సాహం చెందవద్దని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మండల, జిల్లా స్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియపై దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నియోజకవర్గంలోని కార్యకర్తలు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్

బీసీ రిజర్వేషన్‌లకు పెద్దపీట

మందమర్రిటౌన్: రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సంస్థాగత ఎన్నికలకు సంబంధించి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ మాట్లాడుతూ పార్టీని మరింత పటిష్ఠం చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్‌గౌడ్, బండి సదానందం, రఘునాథ్‌రెడ్డి, రాజు, విజయ, లక్ష్మణ్, ఇసాక్, జావేద్‌ఖాన్, గణేష్, శ్రీనివాస్, రజనీ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయం వద్ద కమాన్ ఏర్పాటు

మందమర్రిరూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద శనివారం సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కమాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఏరియా ఇన్‌చార్జి సలేంద్ర సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యుడు జక్కుల సమ్మయ్య మాట్లాడుతూ కమాన్ ఏర్పాటు కోసం సింగరేణి అధికారులకు విన్నవించగానే స్పందించి కమాన్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఎస్ఈ సదానందం, జేఈ సత్యగౌడ్, నాగుల శ్రీనివాస్, ఫోర్‌మెన్ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ రేంజర్ రత్నాకర్, పోశెట్టి, భీమనాధుని సుదర్శన్, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు రమణచారి, లవకుమార్, సత్యనారాయణ, కనకయ్య, సుధాకర్, రాజయ్య, మల్లేష్, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

సీఐ సీహెచ్ అనూక్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ అనూక్

బెల్లంపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తాళ్లగురిజాల సీఐ సీహెచ్ అనూక్ అన్నారు. శనివారం సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. తాళ్లగురిజాల సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ట మైన చర్యలు చేపడుతాన న్నారు. నేరాల నియంత్రణలో భాగంగా గంజాయి నివారణపై, మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమ స్య ఉన్నా నేరుగా కలవాలని సూచించారు. బాధ్యతలు చేపట్టిన సీఐని పలు వురు నాయకులు, పోలీసులు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

అభివృద్ధే ప్రధాన ఎజెండా

- నేడు జిల్లాలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రుల పర్యటన
- రూ. 200 కోట్ల పైచిలుకు విలువైన పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



మంచిర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు ఆదివారం జిల్లాలో పర్య టించనున్నారు. మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కోట్ల రూపాయల విలు వైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కాగా అభివృద్ధే లక్ష్యం గా చేపట్టిన కార్యక్రమాలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావులు తరలిరానున్నారు.

ఇప్పటికే మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావుతో పాటు జిల్లా అధికారులు పలుమార్లు సభాస్థలి, ఇతర ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో ఏర్పాటు చేయ బోయే బహిరంగసభ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారు. కాగా డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన విజయవంతం కోసం ఎమ్మెల్యేతో పాటు అధికారులు కృషి చేస్తున్నారు.

శంకుస్థాపనలు ఇలా...

ఆదివారం ఉదయం 11 గంటలకు ఇటీవల ఆధునికీకరించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రారం భించనున్నారు. అనంతరం లక్షెట్టిపేటలోనే ప్రభుత్వ పాఠశాల, కాలేజీను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లిలో మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయబోయే ఇందిరా మహిళాశక్తి సోలార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడంతో పాటు అనంతరం అక్కడే పెద్దఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేస్తుండగా డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

మధ్యాహ్నం 3.45 గంటలకు హాజీపూర్ మండలంలోని గుడిపేట మెడికల్ కాలేజీని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. సాయంత్రం 4.15గంటలకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో సుమారు 200 ఎకరాల్లో ఏర్పా టు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకు శంకు స్థాపన చేస్తారు. సాయంత్రం ఆరు గంటలకు జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో రూ.78కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే లక్షెట్టిపేట బైపాస్ రోడ్డుకు సైతం శంకుస్థాపన

మిగతా 7వ పేజీలో



దండేపల్లిలో బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

జీవో నంబర్ 282ను రద్దు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 282ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను కాంగ్రెస్ ప్రభుత్వం 10 గంటలకు పెంచడం సరైంది కాదన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ, ఆశా, మెప్మా, భవనం, సింగరేణి, వివిధ శాఖల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్ర కల్పిస్తామని, వేతనాలు పెంచుమతాని హామీలు ఇచ్చి నేటికి అమలు చేయడం లేదన్నారు. వెంటనే 10 గంటల జీవో 282ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

కన్నెపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ మణిరాంసింగ్ పేర్కొన్నారు. శనివారం కన్నెపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. అలాగే బెల్లంపల్లి నుంచి కన్నెపల్లికి ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరారు. రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో నాయకులు రాంచందర్, భీమయ్య, కిష్టయ్య, దుర్గయ్య, శంకర్, అన్వర్, సుభాని పాల్గొన్నారు.



అడుగేసి చూడు.. బురద అంటకుంటే ఒట్టు

ప్రభుత్వ పాఠశాలోని విద్యార్థులకు బురద కష్టాలు

దండేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బురదకష్టాలు తప్పడంలేదు. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకే పాఠశాల మైదానం బురదమయంగా మారింది. దీంతో బురద నీటిని దాటుకుంటూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బురద కష్టాలు తీర్చిలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. - దండేపల్లి

నేడు వారసంత బంద్

లక్షెట్టిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేటలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల పర్యటనలో భాగంగా ఆదివారం నిర్వహించే సంత ఒక రోజు బంద్ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పోడు భూముల్లో సాగు అడ్డుకుంటే ఊరుకునేది లేదు

ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి



అటవీ భూముల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు, గిరిజన రైతులు

నెన్నెల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు సాగు పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి హెచ్చరించారు. మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధి కొత్తగూడెం శివారు భూముల్లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టారు. అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ భూములను స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొందరికి 1/70 చట్టం ప్రకారం పట్టాలు కూడా ఉన్నాయన్నారు. ఆ భూమిని దున్నితే కేసులు పెడతామని అటవీ శాఖ వారు బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్నికల కంటే ముందు అటవీ భూముల్లో సాగులో ఉన్నవారికి హక్కు పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల హక్కులను కాలరాసే జీవో నం. 49ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భూములు దక్కేంత వరకు గిరిజనులకు అండగా పోరాడుతామన్నారు. మాజీ ఉప సర్పంచ్ చిలుకయ్య, నాయకులు మంచాల మధునయ్య, నాగేష్, వెంకటేష్, సాగర్, దిలీప్, కమల, దుర్గక్క, లక్ష్మీ, భీమక్క పాల్గొన్నారు.